# భ్రమ తెచ్చిపెట్టిన రభస

"ఉదయగిరి"

పైనా కిందా మంటలుగక్కే వాతావరణం క్షణంలో చెప్పరాని మార్పు తెచ్చుకుంది. చల్లదనం విద్యార్థుల గదిలోకి ప్రసరిస్తూంది. చల్లగాలితో పాటు మబ్బు నీడలు కమ్ముకున్నయ్. కిటికీ చువ్వల్ని తాకి, భోరుమని లోనికిదూరి, టేబిల్ పైనున్న కాయితాల్ని టపటపమని చిటచిటమని ఎగరేస్తూ పిల్లగాలులు నవ్వుకుంటూ సంబరపడుతున్నాయ్. పిల్లగాలులు తమలో అమాయికంగా కూనిరాగాలు తీసుకుంటున్నాయి. అప్పుడప్పుడు ఆ సంగీతాన్ని క్లాసుకంతా వినిపింపచెయ్యడానికి ప్రయత్నిస్తున్నయ్. దానికి తోడుగా మృదువుతేలి, జారిపోయే నునుపాటి చెక్కిళ్లను నిమురుతూ మద్దెల వాయించుకుంటున్నయ్! కాటుక రెప్పలు వీటి అల్లరికి చిన్నబోయి చూస్తున్నయ్. వీటి చిలిపిగోలకు యిక తట్టుకోలేక అటు తిప్పుకున్నయ్. బడిపిల్లలకుమల్లే కొంటెగా వెళ్ళి కిటికీ రెక్కల్ని దభేలున కొట్టివచ్చి, ఆమె ముఖాన్ని ఉఫ్ఫుమని పొగయింజన్లా ఊదింది. వాటి గోలకు అందర్లో ఏదో విసుగు పుట్టిందేమో! అప్పుడప్పుడు వాటికేసి తీక్షణంగా చూస్తున్నయ్ చూపులు!

క్లాసంతా మూగనోము పట్టినట్టుంది. మరి ఎవ్వరు పలకరేం? ఉలకనైనా ఉలకరే!! ఏమిటీ మౌనం? ఎక్కడిదీ ఆ దీక్ష? ఎవ్వరిది ఆ ఆదర్శం? ఎప్పుడైనా యింత శ్రద్ధగా, నిశ్శబ్దంగా ఉండిందా క్లాసూ? లెక్చరర్ కిటికీ ఊచల్లోంచి ప్రకృతిలోకి ఒక్కసారిచూసి, మళ్ళా తిరిగి తన ధ్యాసలోపడ్డాడు.

కిటికీ వెనకాల కొద్దిగ అటువైపున్న జానకి కలం ఏదో గీకుతోంది. అప్పుడప్పుడు కరకరమంటోంది. పాలి పేపరుతో గుచ్చుకున్నందుకేనేమో ఆ విసుగు! ప్రక్కనున్న రమ చాక్లెట్ అంచు తెల్లటిపమిట గాలికి జవాబిచ్చుకుంటూంది. పమిటచెరుగు గాలికి వెనకవున్న ప్రభావతికి తగిలిందేమో కన్ను నులుముకుంటూంది. వాళ్లకు 'కార్నర్‌రో'లో వున్న విద్యార్థి చూపులు జానకి నొసటిపైన మెరుస్తున్న ఎఱ్ఱటి జ్యోతిమీద కదిలే పిచ్చిపిచ్చి వెంట్రుకల్ని, పచ్చటి ఒంటిమీది ఎఱ్ఱటిగాజుల్ని ఒక్కసారిచూసి, లెక్చరర్ వైపుకు మళ్ళినయ్.

వెలుపల గాలి హోరు! గదిలోపల లెక్చరర్ జోరు! చిత్తచాంచల్యాలకది పట్టిబోరు! కాని, చీకటి కోణాల్లో గది నిశ్శబ్దంగా వింటోంది.

చుట్టు కన్పించే ప్రకృతి అందం అక్కర్లేదా? దాన్లోని ఆనందం పొందను చేతకాదా? ఎందుకు చేతకాదూ? అందరూ 'వరసకవిత్వం' కట్టేవాళ్ళే! ఆ మూలున్న గోపాలం ఊరుకోవున్నాడే? వేంపల్లె వారి విమల తిరిగి చూడదే! గోపాలానికి సందు చిక్కితే చిట్టుక్కుమనకుండా గోడుగోడుమని పిస్తాడే! ఆడపిల్లలపైకి విమానాలు వదలటానికి మంచి అనుకూలం ఇప్పుడే! మసక చీకట్లు ముసిరాయి! పైన మబ్బులు గుత్తిగవున్నాయి. మరి కాటుక చూపులు క్లాసంతా మళ్లించే కమల మళ్ళించదే! తలచుగా వాళ్ళిద్దర్నీ చూసి సరదాపడే క్లాసంతా సీరియస్‌గా ఉందే!

ఆకాశంలో హైడ్రోజన్ బాంబు ప్రేలినట్టు ఉరుములు! కుండపోతగా వర్షం! మధ్యలో కొమ్మలు విరిగే గాలి! వణికించే చలి! క్లాసుమాత్రం చలించదే! నీటిధారలమధ్య కమ్ముకున్న చీకటిని ఆసరాగా తీసుకుని మెఱుపులు స్వారీచేస్తున్నయ్! ఉరుములు ఉరిమినా, మెరుపులు మెరిసినా ప్రకృతికేనా?

విద్యార్థుల బెంచీలక్రింద, విద్యార్థినుల బెంచీల క్రింద చీకటి మసకలు చేరకపోలేదు. అందుకనే బెంచీల క్రింద భాగం అస్పష్టంగా కన్పిస్తోంది. పాదాలు మసకల్లో మునిగినయ్!

వెలుపల ఉరుములు! మెరుపులు!.. లోపల కొంపలు, దేశం కూలేపిడుగులు!...“ కారుచీకట్లు కమ్మినయ్! రహస్యంగా సైన్యాలు హిందూ కోటల్ని ముట్టినయ్. ఆత్మరక్షణకు మన సైన్యం ఎదురైంది. కోరివిదయాల్లా బ్రిటీషు సైన్యం ముందుకొస్తూవుంది! ప్రజల్లో భయం! చీకటి గర్భంలో భయానక దృశ్యం! ప్రళయం! శత్రుసైన్యం...” లెక్చరర్ ఉద్రేకంతో ఇంకా... ఇంకా...విద్యార్థుల్నంతా తన్లోకి ఆకర్షించుకుంటున్నాడు.

ఆ చరిత్రకు కొందరు కంపించారు. కొందరు భయంతో నిండిపోయినట్టుంది. ఆ మూలున్న వాళ్లు చుబుకంక్రింద చేతులుంచుకుని వింటున్నారు. అంతా అయోమయం!

ఆ చీకట్లో ఆమె కాలికి ఏదో చల్లగా తగిలి, మెల్లగా ప్రాకుతున్నట్టుంది. ఆమె శరీరం జలదరించింది. ఒక్కసారి ఆమెను కదిలించివేసింది. చేతిలో వున్న పేనా ఒక్క ఎగురున దూరంగా పడింది... ‘పాము – పాము అమ్మయ్యో’ అని వెఱ్ఱికేకతో బెంచిమీదికే గెంతి, కిటికీ గుద్దుకుంది జానకి. లెక్చరర్ అప్పట్లో కాస్త చలించాడు. వెంటనే కిటికీతలుపులు తీశాడు.

ఆమెకు దడ...ఆగలేదు! గుండెల్లో ... ఒకటే దఢా!! అప్పట్లో ఎన్ని నీళ్ళిచ్చినా తాగేసే దడ పరిగెడ్తూనేవుంది. ప్రక్కనున్న కమల గోడకు అట్టే అంటుకుపోయింది. కిటికీ దగ్గరున్న అమ్మాయి వెంటనే జానకిని పట్టుకుంది. ముచ్చెమటలు పట్టాయి. గుండెలు ఎగశ్వాస పీలుస్తున్నాయి. విద్యార్థులప్పట్లో గేలిస్వభావం మాని, సహాయం చెయ్యడానికి ఉరికారు. ‘కర్రేదీ, కర్రేదీ’ అని ఒకరు. ‘చెప్పు అందుకో... చెప్పు అందుకో...’ మరొకరు. కిటికీ రెక్కలు తెరుచుకున్నాయి. వెలుతురు మసకగా వచ్చింది. ఏదో పొడుగ్గా క్రింద నల్లగా వంకర టింకరగా కదుల్తోంది. మధ్యమధ్య తెల్లటి మచ్చలు మెరుస్తున్నాయి. ఒక చివర సన్నగా, మరొక వైపు లావుగావుంది. లెక్చరర్ అగ్గిపుల్ల వెలుతురు చూపెట్టాడు. గదంతా ఘంగారుపెట్టి, నానాగోల, రభస చెయ్యించింది నల్లటి రిబ్బను ముక్క! కిటికీ లోంచి వచ్చేగాలికి యింకా విషసర్పంలాగా కదుల్తూనేవుంది.

ఎగశ్వాస పీల్చే గుండెలు “హ...మ్మ...య్యా..!” అంటూ నిట్టూర్పు విడిచాయి! ఆ నిట్టూర్పులో నిర్జీవ ప్రతిమలాగుండిపోయిన జానకి కాటుక చూపుల్లో చిలిపితనం, పెదవుల్లో సిగ్గుతో కలిసిన చిన్ననవ్వు ఒక్క క్షణం తలుక్కుమన్నయ్! ఇందాక ముందే తీసి తొడమీదుంచుకున్న రిబ్బనే తెచ్చిందీ యీ రభస! తెగి జడకు వేసుకుంటూ బెల్ కొట్టిందాకా ఆమె సిగ్గుతో చూపులు ప్రక్క బెంచికేసి నిల్పకొనుండిపోయింది.


## ఏజంట్లు కావాలి!

రాజమహేంద్రవరం, విశాఖపట్టణము, విజయనగరము, అనంతపురం, కాకినాడ, హైదరాబాదు, సికిందరాబాదు-యింకా యితర ప్రదేశాలలో మా పత్రికలు అమ్మబడని చోట్లలో తమ స్వంత బాధ్యతపై అమ్ముటకు – ఏజంట్లుగా నున్న వారికి రూ. 100/-కు రూ. 20/-లు. కమీషను, ఒక ఫ్రీకాపీ యివ్వబడును.

అడ్వర్టైజుమెంటులను కాన్వాస్ చేయువారికి మంచి కమీషను సదుపాయముల నివ్వగలము.

వివరములకు:

గృహలక్ష్మి కార్యాలయం

రాయపేట, మద్రాసు-14